గుంతల రోడ్లకు ట్రాఫిక్ పోలీసుల మరమ్మతులు

మియాపూర్ : మియాపూర్– బొల్లారం రోడ్డు, మదీనగూడ జాతీయ రహదారిపై ఉన్న గుంతలను మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు పూడ్చారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులలో గుంతలు పడడంతో ట్రాఫిక్ సమస్య వస్తోంది. జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు కంకర,ఇసుక, సిమెంట్, బీటీ తీసుకువచ్చి గుంతలు పూడుస్తున్నారు.దీంతో ప్రజలు ట్రాఫిక్ పోలీసులను ప్రశంసిస్తున్నారు.

అరుదైన శస్త్రచికిత్స

మాదాపూర్: న్యూరోఫైబ్రోమాటోసిస్ తీవ్రమైన కై ఫోస్కోలియోసిస్‌తో బాధపడుతున్న 47 సంవత్సరాల రోగికి వెన్నుముక శస్త్రచికిత్సను చేసి ప్రాణాలు కాపాడారు మెడికవర్ వైద్యులు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో శుక్రవారం శస్త్రచికిత్స వివరాలను వైద్యులు వెల్లడించారు. డాక్టర్ సూర్యప్రకాశ్ రావు మాట్లాడుతూ రోగికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది మొదలై రక్తపోటు గణనీయంగా పడిపోయింది. ప్రాణాపాయస్థితికి చేరడంతో అత్యవసర బృందం రోగికి వివిధ దశలలో చికిత్స అందించారు. వెన్నుముక ఆపరేషన్ చేశారు. రోగి పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మేఘనరెడ్డి, డాక్టర్ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

హరిత గణపతిగా..

పటాన్‌చెరు టౌన్: గణేష్‌గడ్డ ఆలయంలో జరుగుతున్న నవరాత్రోత్సవాలలో భాగంగా మూడో రోజు శుక్రవారం స్వామివారిని ఆకుపచ్చవర్ణంలో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్ లు ప్రత్యేక పూజలు, హోమం చేశారు.

లంబోదరాయ..

శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో గణేష్ మండపాల వద్ద లంబోదరునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి, భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో భక్తులు గణేశుడిని దర్శించుకుంటుండడంతో మండపాల వద్ద సందడి నెలకొంటోంది.

శేరిలింగంపల్లిజోన్ బృందం



మధురానగర్‌కాలనీలో..



హఫీజ్‌పేట్‌లో గణనాథుడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు



లింగంపల్లిలో..
హనుమాన్ యూత్ అసోసియేషన్



చందానగర్ సుభాష్‌నగర్ కాలనీ గంగారంలో...



పాపిరెడ్డికాలనీలోని గణేష్ సెంటర్‌లో .. పూజలో పాల్గొన్న స్థానికులు



రాయదుర్గం శ్యామ్‌లేట్‌వీధిలో..
బాలగణేష్ యూత్ అసోసియేషన్



రాయదుర్గంలో.. అఖిలభారత ధర్మజాగరణ ప్రముఖ్ ఆలెశ్యామ్‌జీ, బీజేపీ నాయకులు

'మనూ'లో ఐటీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

రాయదుర్గం: మనూలో పోస్టు డాక్టోరల్ ఫెలోషిప్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ కోర్సుల అడ్మిషన్లకు గడువు తేదీని పొడిగించినట్లు స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ శుక్రవారం తెలిపారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కింద విశ్వేశ్వరయ్య పీహెచ్‌డీ పథకం కింద పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ కోర్సులలో అడ్మిషన్ కోసం దరఖాస్తులను కోరుతున్నామన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌లకు సెప్టెంబర్ 20 చివరి తేదీగా నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితా సెప్టెంబర్ 26న ప్రదర్శించబడుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం 'మనూ' వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

తుది దశకు చేరుకున్న పనులు



ఆస్పత్రిలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు పట్టణంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు తుది దశకు చేరుకున్నాయని.. అతి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఆస్పత్రి అధికారులతో కలిసి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు .అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ప్రధానంగా పారిశ్రామికవాడల్లో జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అందుకు అవసరమైన శస్త్ర చికిత్స విభాగాలు సైతం ఇందులో ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, టీఎస్ఎంఎస్ఐడీసీ డీఈ రవీందర్ రెడ్డి, ఆస్పత్రి అభివద్ధి సంఘం సభ్యులు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

శంకుస్థాపన

మియాపూర్ : చందానగర్ డివిజన్ పటేల్ చెరువు అలుగు నుండి గంగారం చెరువు వరకు రూ.18కోట్ల 92లక్షలతో చేపట్టబోయే నాలా విస్తరణ పనులకు కార్పొరేటర్లు మంజుల, శ్రీకాంత్, వెంకటేష్‌గౌడ్, ఎస్ఎన్‌డీపీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. శాంతినగర్ కాలనీలో పటేల్ చెరువు నుండి గంగారం చెరువు వరకు పనులు చేపడుతున్నామని తెలిపారు.

ధ్యాన్‌చంద్ నేటి తరం క్రీడాకారులకు స్ఫూర్తిదాయకం

రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీహరి, శివసేనా రెడ్డి, ఎండి సోని బాలాదేవి

గచ్చిబౌలి: ఒలింపిక్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించిన ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జీవితం నేటి తరం క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొన్నారు. హాకీ స్టేడియంలో ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తున్నారని, ఒలింపిక్స్‌లో పతకాల సాధనే లక్ష్యంగా క్రీడాకారులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనా రెడ్డి మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా అనేక క్రీడలలో పోటీలు నిర్వహించామని 41 మంది విజేత క్రీడాకారులకు రూ.1.29 కోట్లు నగదు బహుమతిగా అందజేశామన్నారు. క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న కోచ్‌లకు గురువందనం బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితెందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండి సోనీ బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, కోశాధికారి సతీష్‌గౌడ్, గచ్చిబౌలి స్టేడియం ఏఓ మధు తదితరులు పాల్గొన్నారు.

వ్యవహారిక భాషావికాసం కోసం గిడుగు కృషి

హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ప్రొ.రాములు



తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న ప్రొ.రాములు తదితరులు

రాయదుర్గం: గిడుగు రామమూర్తి తెలుగు వ్యవహారిక భాషా వికాసం కోసం ఎంతో కృషి చేశారని హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ప్రొ.పిల్లలమర్రి రాములు అన్నారు. హెచ్‌సీయూలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవం , గిడుగు రామమూర్తి జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా స్వేచ్ఛ అవసరమని ఆయన భావించారన్నారు. ప్రొఫెసర్ పమ్మి పవన్‌కుమార్ మాట్లాడుతూ సవరల కోసం ప్రత్యేకమైన వ్యాకరణం, స్థానిక తెగల భాషా అధ్యయనానికి గిడుగు రామమూర్తి పంతులు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ప్రొ.విజయలక్ష్మి, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సవర జాతి యొక్క జీవన విధానాన్ని పరిశీలించి వారి జీవితాలపై ఉత్తమ కథలను రచించారన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకులు గోనానాయక్, వారిజారాణి, త్రివేణి, విజయ్‌కుమార్, భాశెట్టిలత, డి విజయకుమారి, పరిశోధక విద్యార్థులు, ఎంఏ విద్యార్థులు పాల్గొన్నారు.

భాష మన ఉనికి..

మియాపూర్ : మదీనగూడలోని కెనరీ ది స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా విద్యార్థులు తెలుగు కవిత్వ సౌందర్యం, కవుల పరిచయం, గేయాలు, నాటికల ద్వారా ఆకట్టుకున్నారు. భాష అంటే మన ఉనికి అనే సందేశంతో నాల్గవ తరగతి విద్యార్థులు నాటిక ప్రదర్శించారు.

క్వాంటం టెక్నాలజీ విప్లవాత్మక మార్పు

- వీసీ ప్రొ.బీజేరావు
- హెచ్‌సీయూలో అంతర్జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం



రాయదుర్గం: క్వాంటం టెక్నాలజీ ఔషధ ఆవిష్కరణ ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు వెల్లడించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రాంగణంలో ఆసియా బయోటెక్ అసోసియేషన్ల సమాఖ్య (ఎఫ్ఏబీఏ) ఆధ్వర్యంలో 'ఔషధ ఆవిష్కరణ– అభివృద్ధి' అనే అంశంపై నాలుగు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను ఆయన శుక్రవారం ప్రారంబించారు. సైన్స్ గురుస్ బోర్డు చైర్మన్ డాక్టర్ జీ జగత్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల నుంచి పరిశోధన ఉత్సుకతను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఆనంద్, డాక్టర్ పి రత్నాకర్, ఎఫ్ఏబీఏ సీఓఓ డాక్టర్ జి జగదీష్ , ఎఫ్ఏబీఏ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి రెడ్డన్న, ఫైజర్ ఆర్ అండ్ డీ మాజీ హెడ్ డాక్టర్ అజిత్‌కామత్, అకాస్టా హెల్త్ వ్యవస్థాపకుడు డాక్టర్ సురేష్ పూసల, ఏఎల్ఎస్ డిస్కవరీ బయాలజీ సొల్యూషన్స్ హెడ్ డాక్టర్ శానవాస్ అలికుంజు, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ రేణుబాల్యన్, డాక్టర్ రాఘవరెడ్డి, డాక్టర్ ధనలక్ష్మి శివనందన్, డాక్టర్ కేఎస్‌రావు, ప్రొఫెసర్ నూరుద్దీన్‌ఖాన్, పలు సంస్థల ప్రతినిధులు, ఫ్యాకల్టీ, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రామ్‌రెడ్డి

రాయదుర్గం: హైదరాబాద్ నగరం గ్లోబల్ హబ్‌గా మారిందని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు జి రామ్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని డల్లాస్ సెంటర్‌లో నగరంలో మొదటి కార్యాలయాన్ని డివైన్ ప్రాపర్టీస్ సంస్థ శుక్రవారం ప్రారంభించింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ భారతదేశంలో రియల్ ఎస్టేట్ రంగం అత్యంత వేగంగా హైదరాబాద్ నగరంలో సాగుతోందని ,భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. డ్రివెన్ ప్రాపర్టీస్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ సులేమాన్ మాట్లాడుతూ భారతదేశంలో అడుగిడడం గ్లోబల్ మార్కెట్‌లోకి అడుగు పెట్టినట్టన్నారు.